క్లుప్తంగా

అరవకూరు చెరువుకు జలకళ



నీటితో కలకలలాడుతున్న అరవకూరు చెరువు

కూడేరు: మండల పరిధిలోని అరవకూరు చెరవుకు జలకళ సంతరించుకుంది. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలపు నీరు, కృష్ణా జలాలు చెరువుకు చేరుతున్నాయి. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ద్వారా ఆత్మకూరు మండలం సింగపల్లి చెరువుకు నీటిని విడుదల చేయడంతో.. సింగంపల్లి చెరువు మరువ పారింది. వంక ద్వారా దిగువన ఉన్న అరవకూరు చెరువులోకి నీరు చేరడంతో నిండుకుండను తలపిస్తోంది. చెరువు కింద కమ్మూరు, అరవకూరు గ్రామాల్లో ఆయకట్టు సుమారు 350 ఎకరాలు ఉంది. చెరువులో నీరు నిల్వ ఉండటంతో ఆయకట్టు కట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూడోలో 'నార్త్' విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం రూరల్: జోనల్ లెవల్ జూడో పోటీల్లో కళ్యాణదుర్గం నార్త్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల పీడీ చల్లా కిరణ్‌చౌదరి బుధవారం తెలిపారు. బెళుగుప్ప మండలం హనకనహల్ జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 29న నిర్వహించిన జోనల్ లెవల్ జూడో పోటీలు నిర్వహించారు. ఇందులో 50 కేజీల కేటగిరిలో సందీప్, 40కేజీల కేటగిరీలో రవితేజ, 30 కేజీల కేటగిరీలో కార్తీక్ , 25 కేజీల కేటగిరీలో సందీప్ సత్తాచాటి బంగారు పతకం సాధించరన్నారు. వీరు వచ్చే నెల అనంతపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

నిబంధనలు తప్పక పాటించాలి



టపాసుల దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ శివరాముడు

కూడేరు: టపాసులు విక్రయించే వారు తప్పకుండా నిబంధనలు పాటించాలని సీఐ శివరాముడు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఇసుక, నీటి డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి అనుమతులు లేకుండా టపాసులు విక్రయించరాదని దుకాణాదారులను హెచ్చరించారు. జన సంచార ప్రాంతాల్లో టపాసులు కాల్చితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ఆధార్ లింకైన లబ్ధిదారులకే ఉచిత గ్యాస్'

కూడేరు: ప్రభుత్వం ఉచితంగా అందించే గ్యాస్ సిలిండర్లు పొందాలంటే రేషన్‌కార్డు కలిగి ఉండి గ్యాస్ కనెక్షన్‌కు తప్పనిసరిగా ఆధార్ లింక్ అయి ఉండాలని మండల సీఎస్‌డీటీ లక్ష్మీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక కుటుంబంలో రెండు గ్యాస్ కనెక్షన్లు ఉంటే అర్హతను బట్టి ఒక కనెక్షన్‌కే ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఉచిత గ్యాస్ పథకానికి అర్హత కలిగిన లబ్ధిదారులు 2025 మార్చి 31లోపు ఎప్పుడైనా గ్యాస్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఖాతాలో సబ్సిడీ నగదు జమ అవుతుందని తెలిపారు.

లైంగిక దాడులు అరికట్టాలి

కళ్యాణదుర్గం రూరల్: మహిళలపై లైంగికదాడులను అరికట్టాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.

హెచ్‌ఎంకు సన్మానం



చంద్రశేఖర్‌నాయుడును సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తమ్మినేని చంద్రశేఖర్‌నాయుడు పదవీ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల ఆధ్వర్యంలో హెచ్‌ఎం నాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ గౌని లావణ్య, ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్ ఆయన సేవలను కొనియాడారు.

పేలుతున్న టపాసుల ధరలు

- భారీగా పెరిగిన బాణసంచా రేట్లు
- మందకొడిగా సాగుతున్న విక్రయాలు



రాయదుర్గంలోని ఓ దుకాణంలో వివిధ రకాల టపాసులు

రాయదుర్గం: తారాజువ్వల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిచ్చుబుడ్లు చెట్టెక్కి కుర్చున్నాయి. ఫ్యామిలీ ప్యాక్ చుక్కలు చూపిస్తోంది. భూచక్రాలు మండిపోతున్నాయి. కొనక ముందే టపాసుల ధరలు పేలుతున్నాయి. మొత్తానికి దీపావళి పండుగ.. సామాన్యుడికి భారంగా మారింది. అయినా ఏడాదికోసారి వచ్చే పండుగ కోసం .. ఇంట్లో పిల్లల ఆనందం కోసం.. ఎంతో కొంత వెచ్చించక తప్పట్లేదు. ఈ నేపథ్యంలో విక్రయాలు లేక వ్యాపారులు నేలచూస్తున్నారు.

25 శాతం పెరిగిన ధరలు

గత ఏడాది కంటే ఈ ఏడాది 20 నుంచి 25 శాతం టపాసుల ధరలు పెరిగాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో లైసెన్స్ కలిగిన టపాసుల దుకాణాలు సుమారు 40 ఉన్నాయి. గతేడాది చిచ్చుబుడ్డి బాక్స్ చిన్నది రూ.60 ఉండేది ప్రస్తుతం రూ.70 కి పెరిగింది. అదే పెద్దబాక్స్ గతేడాది రూ.80 ఉంటే రూ.110 కి పెరిగింది. భూచక్రాలు గతేడాది రూ.80 ఉంటే రూ.100కి చేరింది. దారాలు గతేడాదితో పోల్చితే స్వల్పంగా పెరిగాయి. ఫ్యామిలీప్యాక్ రూ.900 నుంచి రూ.1200 ఇలా అన్ని రకాల టపాసుల ధరలు పెరిగాయి. దీనికి తోడు వ్యాపారం కాస్త మందడికోడిగా సాగుతోందని షాపుల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. సంప్రాదయ పండుగ కావడంతో చివరి రోజు ఆశించిన స్థాయికంటే ఎక్కువగా విక్రయాలు జరుగుతాయని మరికొందరు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దీపావళి అందరి కుటుంబాల్లోనూ ఆనందం నింపాలేకాని విషాదం కాకూడదు. టపాసులు పేల్చే టప్పుడు జాగ్రత్తలు పాటించికపోతే బతుకు చీకట్లు కమ్ముకునే ప్రమాదం ఉందని అధికారులు, విశ్లేషకులు చెబుతున్నారు.

- పిల్లలు సర్వసాధరణంగా కాల్చే కాకరపువ్వొత్తులు, సుర్‌సుర్ బాణాలు, దారాలు విషయంలో అజాగ్రత్త వలన చేతులు కావవచ్చు. పెద్దలు గమనిస్తూ ఉండాలి.
- టపాసులు ఇంటి బయట ఆవరణాల్లో, మైదానల్లో మాత్రమే కాల్చాలి.
- తారజువ్వలు వంటి టపాకాయలను ఇండ్లు, భవనాలు, గుడిసెలే, గడ్డివాయులు లేని ప్రదేశాల్లో కాల్చాలి.
- చిచ్చుబుడ్లు, తారజువ్వలు, భూచక్రాలు వంటి టపాకాయలను శరీరానికి దూరంగా ఉంచి కాల్చడం మంచిది.
- టపాకాయలు విక్రయించే దుకాణాల దరిదాపుల్లో బాణసంచా కాల్చడం మరీ ప్రమాదం.
- పెద్ద టపాకాయలు కాల్చేటప్పుడు వాటిని గాలిలో గిరగిరా తిప్పడం, పైకి విసరడం చేయరాదు. అలాచేస్తే కాల్చేవారితో పాటు సమీపంలో నిల్చున్నవారి దుస్తులు కాలి ప్రమాదం జరగవచ్చు.
- రాకెట్లు, చిచ్చరబుడ్లు, భూచక్రాలు, విష్ణుచక్రాలు వంటి టపాకాయలు కాలే సమయంలో వాటి వత్తులు ఆరితేనే దగ్గరకు వెళ్లాలి.
- కాకర వొత్తులు కాల్చిన తర్వాత వాటి కడ్డీలను ఇష్టం వచ్చినట్లు రోడ్లపై విసిరేకూడదు. కుప్పగా పోసి ఆ తర్వాత తీసివేయాలి.
- తారాజువ్వలు (రాకెట్లు) కాల్చేటప్పుడు వాటిని సీసాలో పెట్టి నిటారుగా ఉండేలా సరిచూసి కాల్చాలి. అజాగ్రత్త వహిస్తే పక్కకు దూసుకెళ్తాయి.

ఆశించిన స్థాయిలో వ్యాపారాలు లేవు



గతంతో పోల్చితే ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వ్యాపారాలు లేవు. ధరల మాట అటుంచితే టపాసుల కొనుగోలుపై ప్రజలు ఆసక్తి చూపలేకపోతున్నారు. గత రెండు రోజుల నుంచి వ్యాపారాలు లేక దుకాణాలన్నీ వెలవెలబోతున్నాయి. బుధ, గురువారాలు ఒక్కరోజే చివరి అవకాశం. రిజినబుల్ ధరలకే టపాసులు అందిస్తున్నాం. పాకెట్ మీద రూ.5 లేదా రూ.10 కూడా గిట్టడం లేదు. ఈ ఏడాది లాస్‌లో నడపాల్సి వస్తోంది.

– నాగభూషణ, వ్యాపారి, రాయదుర్గం

చీకటి దరి చేరనీయొద్దు

ప్రతి ఇంట ఎంతో సందడిగా.. ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగ వేళ చీకటి దరి చేరే పొరపాట్లకు తావివ్వద్దు. ఇళ్లల్లో టపాసుల నిల్వతో పాటు కాల్చేసారి తగు జాగ్రత్తలు పాటించేలా వ్యవహరించాలి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మకుండా వ్యాపారులను ఆదేశించాం. టపాసులు కాల్చేసారి పాలిస్టర్ కాకుండా కాటన్ దుస్తులు ధరించాలి. ప్రమాద సమయాల్లో ముందుగా అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

దీపావళి శుభాకాంక్షలు



వై.శివరామిరెడ్డి



మెట్టు గోవిందరెడ్డి



తలారి రంగయ్య



వై.విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గం/ఉరవకొండ/కళ్యాణదుర్గం: రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, డాక్టర్ తలారి రంగయ్య, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవ భక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆకాంక్షించారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం విద్యావవస్థను నాశనం చేస్తోంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విద్యా వ్యవస్థపై ఎలాంటి అవగాహన లేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దార్థ్ మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉరవకొండ పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దార్థ్ మాట్లాడారు. డిగ్రీ, పీజీ, బీఫార్మీ తదితర ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన నిధులను మంజురు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు సోము, మండల అధ్యక్ష, కార్యదర్శులు హిరణ్య, నందు పాల్గొన్నారు.

కిటకిటలాడిన 'దుర్గం' మార్కెట్



రాయదుర్గంలో ప్రమిదలు కొనుగోలు చేసున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: దీపావళి పండుగ నేపథ్యంలో రాయదుర్గం మార్కెట్ కిటకిటలాడింది. పూజ సామగ్రి, పూల కొనుగోలు, నూతన వస్త్రాలు, కిరాణా అంగళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలకు టపాసుల కొనుగోలుకు చిన్నారులు, పెద్దలు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రమిదలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

ఉర్దూ పాఠశాలలో దిగబడిన ఫ్లోరింగ్



దిగబడిన ఫ్లోరింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ వలిబాష, కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆస్పత్రి వెనుక భాగంలో 4వ వార్డు పరిధిలోని రాజీవ్‌గాంధీ ఉర్దూ ప్రాథమిక పాఠశాల గదిలో ఫ్లోరింగ్ కుంగి బండలు దిగబడ్డాయి. గదుల కొరత ఉన్న పాఠశాలలో దాదాపు ఐదు అడుగుల విస్తీర్ణంలో రెండు అడుగల మేర బండలు దిగబడ్డాయి. ఈ విషయాన్ని నెలక్రితమే మున్సిపల్ కమిషనర్‌తో పాటు విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఫ్లోరింగ్ దిగబడిన విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాష, వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, 2వ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శ్రీనివాసులు బుధవారం ఉర్దూ పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ఈ విషయాన్ని కమిషనర్, ఎంఈఓలతో మాట్లాడారు. వెంటనే మరమ్మతులు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

అమరవీరుల సేవలు అమూల్యం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అర్బన్, రూరల్ సీఐలు

ఉరవకొండ: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను ఆదర్శంగా తీసుకోవాలి. వారి అడుగుజాడల్లో నడవాలని ఉరవకొండ అర్బన్, రూరల్ సీఐలు సురేష్‌బాబు, సయ్యద్ చిన్నగౌస్ పిలుపునిచ్చారు. బుధవారం ఉరవకొండలోని పోలీసు క్రీడా మైదానంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ఉరవకొండ అర్బన్ సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో మోగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని అర్బన్, రూరల్ సీఐలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని తెలిపారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుకోవడానికి రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన హెడ్ కానిస్టేబుల్ కులశేఖర్‌రెడ్డితో పాటు మరికొంతమంది సిబ్బందిని సీఐలు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు సప్తగిరిమల్లి, ఆపద్బాంధవ ట్రస్ట్ ప్రతినిధి మురళీ పాల్గొన్నారు.

పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



ఎస్సీ కాలనీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు



మాట్లాడుతున్న డీటీ లక్ష్మీనరసింహులు

కణేకల్లు: పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఫణికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కణేకల్లులోని ఎస్సీ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అధికారులు ప్రజలతో కలిసి ఎస్సీ కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ,ఎస్టీ పౌర హక్కుల రక్షణ కోసం అన్నీ శాఖల అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ఎస్ఐ నాగమధు, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఈశ్వరయ్య, సర్పంచ్ నాగరాజు, ఆర్ఐ రామాంజినేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: సమాజంలో అందరికీ సమాన హక్కులు ఉంటాయని తహసీల్దార్ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం బోరంపల్లిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ మనుషులు అందరూ సమానమేనని, ఇతరులపై వివక్ష చూపకూడదన్నారు. అనంతరం గ్రామంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, సర్పంచ్ శోభారాణి, ఎంపీడీఓ రామచంద్ర, సీఐ వంశీ, అధికారులు పాల్గొన్నారు.

కంబదూరు: పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని డిప్యూటి తహసీల్దార్ లక్ష్మీనరసింహులు, ఏఎస్ఐ ఓబుళపతి అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందన్నారు. కుల వివక్ష చట్టరీత్యా నేరమన్నారు. వార్డెన్ నాగరాజు, వీఆర్వో సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కూడేరు: ప్రతి ఒక్కరూ చట్టాలుపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్ సూచించారు. మండల పరిధిలోని ముద్దలాపురంలో బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఏవైనా సమస్యలున్నాయా? కుల దూషణలు, తదితర సంఘటనలు ఏమైనా జరిగియా అని ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సమస్యలపై కూడా స్పందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామానాయుడు, బాయ్స్ హాస్టల్ వార్డెన్ గురు ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.



ముద్దలాపురంలో మాట్లాడుతున్న డీటీ సూర్య ప్రతాప్

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



కలగళ్లలో ఆముదం సాగులో సూచనలిస్తున్న ఏఓ విజయ కుమార్

కూడేరు: నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించడానికి వీలుంటుందని మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కలగళ్ల, ఇప్పేరు గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాయదుర్గాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులు, కూలీలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ ముందు సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మల్లికార్జున మాట్లాడుతూ కరువు మండలాల జాబితాలో జిల్లాలోని 31 మండలాలకుగాను కేవలం 7 మండలాలకు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం శోచనీయమన్నారు. వెంటనే మిగిలిన 24 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు.

కళ్యాణదుర్గం రూరల్: జిల్లాలోని 31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు.

మార్మోగిన ఆంజనేయ స్వామి నామస్మరణ



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ సతీమణి భువనేశ్వరి

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి సతీమణి భువనేశ్వరి, ఎంపీపీ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ దేవ, సర్పంచ్ ధనుంజయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తదితరులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

విద్యుత్ తీగ మీదపడి పొట్టేలు పిల్లల మృతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం విద్యుదాఘాతంతో ఐదు పొట్టేలు పిల్లలు మృతి చెందాయి. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన గోవిందప్ప కాలనీ పరిసరాల్లో 10 పొట్టేళ్ల పిల్లలను మేపు కోసం తీసుకెళ్లాడు. పొట్టేళ్లు మేత మేస్తుండగా విద్యుత్ తీగ తెగి వాటిపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన 5 పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనలో రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఇసుక టిప్పర్ పట్టివేత

గుమ్మఘట్ట: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ (కేఏ17సీ 9846)ను మండలంలోని తాళ్లకెర గ్రామ సమీపంలో బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. రంగచేడు గ్రామ సమీపంలోని వేదావతి హగరి నుంచి ఇసుక తరలిస్తుండగా రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్ యజమాని పప్పేశ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

రెండేళ్ల తర్వాత హత్య కేసు ఛేదింపునకు చర్యలు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ సమీపంలో చౌదరయ్య (75) రెండేళ్ల క్రితం హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. అయితే తాజాగా ఆ హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు మళ్లీ కేసును తెర మీదకు తెచ్చారు. బుధవారం రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్... హత్యకు గురైన చౌదరయ్య ఇంటిని సందర్శించి, హత్యను సంఘటన స్థలాన్నీ పరిశీలించారు. రెండేళ్లుగా హత్య కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఎస్పీ చొరవతో మళ్లీ కేసును దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు.

2 నుంచి కార్తీక పూజలు

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతనమైన మాల మల్లేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 2 నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక పూజలు నిర్వహిచనున్నట్లు ఆలయ ఈఓ దాసు, గ్రామ పెద్దలు, అర్చకులు తెలిపారు. బుధవారం వారు కార్తీక పూజలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటలకు వరకు ఏకవార రుద్రాభిషేకం, ప్రతి సోమవారం ఏకాదశవార రుద్రాభిషేకం, ఉదయం 10 గంటల నుంచి తీర్థప్రసాద వినియోగం జరుగుతుందని వారు తెలిపారు.

పరామర్శ



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామానికి చెందిన కుమ్మరి హేమాద్రి రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమ్మరి హేమాద్రి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేమకల్లులో కార్తీక మాస ఉత్సవాలు

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజినేయస్వామి ఆలయంలో నవంబర్ 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కార్తీక మాసపు ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ తెలిపారు. నవంబర్ 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు పూల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

కణేకల్లు: మండలంలోని అంబాపురం గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకుడు కడియాల నాగరాజు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

నట్టల నివారణ మందు తాపించాలి

కూడేరు: గొర్రెలకు, మేకలకు డీ వార్మింగ్ మందు తాపడం వల్ల వాటిలో జీర్ణశక్తి మెరుగుపడి ఎదుగుదల బాగుంటుందని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మరుట్ల, ఇప్పేరు, కూడేరు, కమ్మూరు, గొటుకూరు పంచాయతీల్లో పశువైద్యశాఖ అధికారులు డీ వార్మింగ్ కార్యక్రమం నిర్వహించారు.